కోత్మీర్ గ్రామంలోని పోచమ్మకు అభిషేకం చేస్తున్న భక్తులు

పోచమ్మ ఆలయంలో పూజలు

దహెగాం,అక్టోబర్13 : మండలంలోని కోత్మీర్ గ్రామంలోని పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. గ్రామంలో విషజ్వరాలు ఇతరత్ర వ్యాధులు ప్రబల కూడదని మహిళలు సమీపంలోని పెద్దవాగుకు వెళ్లి గంగాజలం తీసుకవచ్చి పోచమ్మకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధితకుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నాయకులు

బెజ్జూర్, అక్టోబర్ 13 : మండల కేంద్రానికి చెందిన రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొండ్ర జగ్గాగౌడ్ తల్లి కోండ్ర బుచ్చమ్మ శుక్రవారం ఉదయం మృతిచెందడంతో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన సతీమణి రమాదేవితో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బుచ్చమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు అధైర్య పడకూడదని వారిని ఓదార్చారు. బీఆర్ఎస్ పరంగా తమ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఆయన వెంట కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ డోకె వెంకన్న, కో-ఆప్షన్ సభ్యుడు బషరాత్ ఖాన్, మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్రంగి రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు సతీశ్, నాహెర్, దుర్గాగౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి

పెంచికల్ పేట్, అక్టోబర్ 13 ప్రమాదవశాత్తు ప్రాణహిత కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలం ఇంద్రగాం గ్రామానికి చెందిన కావిడే బాబురావు (54) మూడు రోజుల క్రితం సమీప బంధువు చనిపోవడంతో తిథి కార్యక్రమానికి లోడ్పల్లికి వచ్చాడు. గ్రామ సమీపంలో ఉన్న ప్రాణహిత కాలువలో స్నానాలు చేయడానికి బంధువులందరూ వెళ్లారు. ఈ క్రమంలో నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బయటకు కనిపించక పోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని ఈతగాళ్ల సహాయంతో వలవేసి మృతదేహాన్ని బయటకి తీశారు. భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, అక్టోబర్ 13 పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమాలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 నుంచి 2.30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కాగజ్‌నగర్, అక్టోబర్ 13: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ విద్యాలయంలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో లేడీ ఆఫ్ ఫాతిమా ఫీస్ట్ వేడుకల సందర్భంగా దివ్యాంగులకు, రోగులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

ఓటరు జాబితా పూర్తి చేయాలి

లక్షెట్టిపేట, అక్టోబర్ 13: ఈ నెలాఖరుకల్లా ఓటరు జాబితా పూర్తి చేయాలని కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేయాలని బీఎల్వోలను తహసీల్దార్ రాఘవేంద్రరావు ఆదేశించారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని బీఎల్వోలకు పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త ఓటరుగా నమోదుకు ఈ నెల 31న చివరి తేదీ అని తెలిపారు.

ఓవరాల్ ఛాంపియన్ ఆసిఫాబాద్

- **ముగిసిన జోనల్ స్థాయి క్రీడోత్సవాలు**

జోనల్ స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన ఆసిఫాబాద్ డివిజన్ క్రీడాకారులు

ఆసిఫాబాద్,అక్టోబర్13: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆసిఫాబాద్ డివిజన్ కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని మంచిర్యాల డివిజన్ నిలువగా తృతీయ స్థానంలో జైనూర్ డివిజన్ నిలిచింది. ఈ జోనల్ క్రీడల్లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ,జైనూర్,మంచిర్యాల్ డివిజన్లు తలపడ్డాయి. ఆసిఫాబాద్ డివిజన్ 11 గేమ్స్‌లో ప్రథమ స్థానం నిలువడంతో 180 పాయింట్లు సాధించి ఓరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. మంచిర్యాల డివిజన్ ఏడు గేమ్స్‌లో ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్ క్రీడల్లో ఆసిఫాబాద్ డివిజన్ 112 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో, జైనూరు డివిజన్ అథ్లెటిక్స్ లో 82 పాయింట్లు సాధించి రెండో స్థానం కైవసం చేసుకుంది. ఓవరాల్ ఛాంపియన్షిప్ గెలుపొందిన క్రీడాకారులకు ఆసిఫాబాద్,మంచిర్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు రమాదేవి , మడావి గంగారం క్రీడాకారులను అభినందించారు. బంగారు, వెండి పతకాలను, మెమొంటోస్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎసీఎంవో ఉద్ధవ్,ఎటీడీవోలు క్షేత్రయ్య, కమర్ హుస్సేన్, పురుషోత్తం, చిరంజీవి, స్పోర్ట్స్ అధికారులు మీనారెడ్డి, జీవరత్నం, జిల్లాక్రీడా సమాఖ్య కార్యదర్శి సాంబశివరావు , పీడీలు,ఉపాధ్యాయులు మధుసూధన్, కృష్ణమూర్తి , సాగర్, అరవింద్, పీజీ ప్రధానోపాధ్యాయులు జయంతి ,గోపాల్ ,లక్ష్మయ్య, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలుపై తీర్మానం

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం చైర్మన్ ఓంప్రకాశ్

బెజ్జూర్, అక్టోబర్ 13 : మండల కేంద్రంలోని సహకార సంఘంలో శుక్రవారం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్ అధ్యక్షతన పాలకవర్గం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రైతు రుణమాఫీ అమలుపై సభ్యులు తీర్మానం చేశారు. అదేవిధంగా సంఘంలో నిధుల నిల్వ ఉన్న సిబ్బంది నుంచి వసూలు చేయాలని చర్చించారు. ఈ నెల 23 నాటికి సిబ్బంది వద్ద నిల్వ ఉన్న డబ్బులు సంఘానికి చెల్లించాలని సభ్యులు సిబ్బందికి సూచించారు. లేకపోతే వసూలు చేసేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సిబ్బంది జీతభత్యాల చెల్లింపుపై సభ్యులు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ టి సబ్ రిజిస్ట్రార్ శ్యాముల్, సీనియర్ అసిస్టెంట్ రాజేందర్, సహకార బ్యాంకు మేనేజర్ తిరుపతి, సీఈవో సంజీవ్, సిబ్బంది వెంకటేశ్వర్‌గౌడ్, సత్యనారాయణ గౌడ్ సభ్యులు టేలి బాపు, కోటేశ్, భీమయ్య, వెంకటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన నాయకులు

కౌటాల: సోషల్ మీడియా సమావేశానికితరలివెళ్తున్న మండల నాయకులు

కౌటాల, అక్టోబర్ 13: కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో నిర్వహించిన సిర్పూర్ నియోజక వర్గ సోషల్ మీడియా సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, యువకులు బారీగా తరలివెల్లారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌లు మన్నె క్రిషాంక్, దినేష్ చౌదరిలు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. కోనేరు కోనప్ప పిలుపు మేరకు భారీగా కార్యకర్తలు బయలు దేరినట్లు, సిఎం కెసిఆర్, ఎమ్మెల్యే కోనప్ప ఆధ్వర్యంలో పల్లెలన్ని అభివృద్ధి చెందినట్లు కార్యకర్తలు తెలిపారు. సోషల్ మీడియా సమావేశానికి వెల్లిన వారిలో సర్పంచులు మౌనిష్, రాందాస్, కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, పార్టీ యూత్ అధ్యక్షుడు రవీందర్ గౌడ్, శ్రీనివాస్, సంతోష్, డబ్బా బాపు, గోపాల్, ప్రకాష్, రమేష్, రాంచందర్, సాయి ఆయా గ్రామాల నుండి బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలివెల్లారు..

తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 13 : విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను పొందేందుకు అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డీ సుమతి అన్నారు. శుక్ర వారం కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఇంటికి వచ్చాక ఏం చేస్తున్నారో గమనించాలని, తప్పుడు బాట పట్టకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం షీటీం ఎస్ఐ హైమ, ఏఎస్ఐ ఓబులమ్మ మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత, బాధ్యత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే శివలీల, కో ఆర్డినేటర్ రిజ్వానా, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంపాస్ట్ ఎరువును తయారు చేయాలి

జన్నారం, అక్టోబర్ 13 : గ్రామాల్లోని తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్ట్ ఎరువుగా మార్చాలని డివిజన్ పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని హాస్టల్ తండా గ్రామ పంచాయతీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో వివిధ కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించారు. రోడ్లు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రమేశ్, సర్పంచ్ బనావత్ జయశ్రీ, కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే జెండా వార్షికోత్సవం

డబ్బా బారెగూడాలో మాలీ సంఘం జెండను ఆవిష్కరిస్తున్న గ్రామాధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్

చింతలమానేపల్లి, అక్టోబర్ 13: మండలంలోని డబ్బా బారెగూడ గ్రామంలో మాలీ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతీబావు పూలే, సావిత్రి బాయి పూలే, మాలీ సంఘం జెండా వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలీ సం ఘం గ్రామాధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాజ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం మాలీ కులస్థులందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మా లీ సంఘం మండలాధ్యక్షుడు నికోడె బాపురావు, టాకిరే బాపురావు, గణపతి, పెద్ద బాపురావు, శ్రీనివాస్, చుక్కయ్య, డవాయి బాపురావు, పెంటయ్య, రాజారాం, మాలీ సంఘం నాయకులు, కుల స్థులు, యువకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.